క్లుప్తంగా

శేషసాయిలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



లబ్బీపేట(విజయవాడతూర్పు): వివాహాలు, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎంజీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో గురువారం ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో రకాల వస్త్రాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు వంటి వాటితో పాటు, పైథానీ సిల్క్ చీరలు, బెంగుళూరు సాఫ్ట్ సిల్క్ చీరలు, బెంగాల్ బలూచారీ, జమదాని, టాంగైల్, ఢకాయ్ సిల్క్ వస్త్రాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 13 వరకు కొనసాగే ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

చిన్నారుల మేధో వికాసానికి గ్రంథాలయ సందర్శన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల మేధో వికాసానికి గ్రంథాలయ సందర్శన దోహదపడుతుందని గ్రంథాలయాధికారి కె.రమాదేవి తెలిపారు. గ్రంథాలయాలపై చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ప్రీ స్కూల్ విద్యార్థులకు గ్రంథాలయ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. కానూరులోని లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ విద్యార్థులు బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. గ్రంథాలయాన్ని, అందులోని పుస్తకాలను విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. చిన్నారులకు కథల పుస్తకాలు, కార్టూన్ బుక్స్ చూపించారు. కార్యక్రమంలో లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ ఇన్‌చార్జి గాయత్రి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం విజేతలను ప్రకటించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా పుష్పార్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన గురువారం శ్రీ గోదా రంగనాథస్వామివార్లకు పుష్పార్చన కార్యక్రమం కనులపండువగా జరిగింది. పలు రకాల పుష్పాలతో వేదమంత్రాలు, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణంలో అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పారాయణ మండలి ఆధ్వర్యాన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. కార్యక్రమాలను పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

ఎలక్ట్రిక్ కుట్టుమిషన్ల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం రజక కల్యాణ మండపంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఎలక్ట్రిక్ కుట్టుమిషన్‌లను గురువారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ సర్వీసు రోడ్డుకు మోక్షమెప్పుడో !

- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
- రహదారి నిర్మించాలని వినతి



సాయిబాబా కాలనీ వైపు సర్వీసు రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గత ప్రభుత్వ హయాంలో ఐదు డివిజన్ వాసులకు ఉపయోగపడే విధంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన మధురానగర్ ఆర్‌యూబీ పూర్తయ్యినా, సర్వీసు రోడ్డు పనులు నేటికీ ఒక కొలిక్కి రాలేదు. మధురానగర్ ఆర్‌యూబీకు ఇరువైపులా ప్రజలు రాకపోకలు సాగించే విధంగా సర్వీసు రోడ్డు నిర్మిస్తామని అధికారులు అప్పట్లో ప్రకటించారు. ఆర్‌యూబీ పనులతో పాటు సర్వీసు రోడ్డును కూడా పూర్తి చేస్తామంటూ హామీలు ఇచ్చారు. కానీ ఆర్‌యూబీ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చి ఏడాది దాటింది. కానీ ఇంత వరకు సర్వీసు రోడ్డు పనులు మాత్రం ప్రారంభించలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఓపెన్ డ్రెయిన్ పనులు పూర్తిచేసిన తరువాతర రోడ్డుపనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రాకపోకలు సాగించలేని దుస్థితి..

ఓపెన్ డ్రెయిన్ పనులు పూర్తయ్యి సుమారు ఆరు నెలలు కావస్తోంది. అయినప్పటికీ రోడ్డు మాత్రం వేయలేదు. దీంతో రాకపోకలకు పసుపుతోట, సాయిబాబా కాలనీ తదితర ప్రాంత వాసులు నానాయాతన పడుతున్నారు. గ్రావెల్ రోడ్డు కావటంతో దుమ్ములేచి తరచూ అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ రోడ్డులో మ్యాన్‌హోల్ ఎత్తుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక చినుకు పడితే ఈ రోడ్డుపై రాకపోకలు సాగించలేని దుస్థితి ఏర్పడుతుందని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



పసుపు రోడ్డులో ప్రమాదకరంగా ర్యాంప్

అనారోగ్య సమస్యలు వస్తున్నాయి..



ఇక్కడ రోడ్డు పనులు పూర్తి చేయకపోవటం వల్ల దుమ్ములేచి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. రోడ్డు వేయాలని ఎన్నిమార్లు అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకున్న వారే కరువయ్యారు. సర్వీసు రోడ్డు నుంచి పసుపుతోట తిరిగే మలుపు సరిగా వేయకపోవటం వల్ల ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

–ఎస్‌కే షకీలా, స్థానికురాలు, మధురానగర్

రోడ్డు పనులు పూర్తి చేయాలి..



ఆర్‌యూబీను ఇప్పటికీ రెండు సార్లు ప్రారంభించారు. సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే బాగుండేది. ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్లాయి. సర్వీసు రోడ్డు వేయకపోవటం వల్ల వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సత్వరమే రోడ్డు వేయాలి. లేనిపక్షంలో ప్రజల తరుపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– బోడి శివప్రసాద్, సీపీఎం డివిజన్ కార్యదర్శి

రాకపోకలకు ఇబ్బందులు..



ఆర్‌యూబీకి ఇరువైపులా సర్వీసు రోడ్డును వేయకపోవటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. రాళ్లు లేవడంతో వాహనాలు తరచూ పాడవుతున్నాయి. అలాగే సాయిబాబా కాలనీకు వెళ్లే ప్రాంతంలో ర్యాంపు వేయాలి. రబ్బీసు పోసి వదలివేయటం వల్ల వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వి.రామారావు, స్థానికుడు, పసుపుతోట

జాతీయ క్రీడలకు ఎస్ఆర్ఆర్ విద్యార్థి ఎంపిక



బాలగంగాధర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.బాలగంగాధర్ 38వ జాతీయ క్రీడల స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన అధ్యాపకులు, వ్యాయామ విద్యా విభాగం సిబ్బంది బాలంగాధర్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరగబోయే స్విమ్మింగ్ పోటీల్లో బాలగంగాధర్ పాల్గొంటారన్నారు. జాతీయ పోటీల్లో సత్తా చాటి కళాశాల, నగర ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ డి.యుగంధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన జాతీయ పోటీలకు ఎంపికైన బాలగంగాధర్ జాతీయ పోటీలలో పతకం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ జి.నాగేశ్వరరావు, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.సుధాకర్, డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, సిబ్బంది, విద్యార్థులు బాలగంగాధర్‌ను అభినందించారు.

ఆరోగ్య రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత బాబూరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కనీసం 6 శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య అధ్యక్షతన గురువారం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య బడ్జెట్–ప్రజారోగ్యం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేట్ బీమా కంపెనీకి అప్పజెప్పకుండా ప్రభుత్వ రంగంలోనే బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ బకాయిలను వెంటనే తీర్చి ఆరోగ్యశ్రీని కొనసాగించాలని కోరారు.

ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకుడు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో సరిపోయేంత సిబ్బంది, పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ.. మానవ వనరుల అభివృద్ధిలో ఆరోగ్యం పాత్ర చాలా ముఖ్యమన్నారు. చిన్న పిల్లల వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రి తరహాలో మన రాష్ట్రంలో చిన్న పిల్లల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పడం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటైజేషన్ చేయడం తప్ప ఇంకొకటి కాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి, పథకాన్ని కొనసాగించాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య, జిల్లా కార్యదర్శి జి.విజయ ప్రకాష్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు తదితరులు మాట్లాడారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



రవీంద్రభారతి స్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



శారదా స్కూల్‌లో రంగవల్లులు



వాణి స్కూల్‌లో భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): స్థానిక సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, హరికథా కీర్తనలు, పిండి వంటలతో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల చైర్మన్ వీరమాచనేని వంశీ, శాంతి దంపతులు పాల్గొని చిన్నారులకు బోగి పండ్లు పోసి ఆశీర్వచనాలు అందజేశారు. పాఠశాల ఎండీ రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లోని శారదా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణను విద్యార్థులు అందమైన రంగవల్లులతో అలంకరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఈసీ మెంబర్ కుందా అర్చన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఏఎల్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని వాణి స్కూలు కరస్పాండెంట్, న్యాయవాది అంజూరి శేషుబాబు అన్నారు. వాణి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ ఏ ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని నేషనల్ బీసీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవ రాయుడు డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం వడ్డెర కార్పొరేషన్‌కు రూ.250 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్వయం ఉపాధి గ్రూపులకు బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా ఆర్థిక సహాయం చేయాలని, ఆదరణ పథకం కింద ఆధునిక పనిముట్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. గనులు, క్వారీలలో ప్రమాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఉచిత ప్రమాద బీమా రూ.10 లక్షలు మంజూరు చేయాలని, చిన్న కాంట్రాక్టు పనులు నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. సమావేశంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాసరావు, బి.శివ, తమ్మిశెట్టి ప్రసాద్, అంకేశ్వరరావు, ఉప్పు రాంబాబు, సావిత్రమ్మ, లక్ష్మీనారాయణ, ఓ.వీర భాస్కర్ పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్స్‌కు చేరిన రాష్ట్ర కబడ్డీ జట్టు



విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరుగుతున్న 50వ జాతీయ జూనియర్ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఈ నెల ఎనిమిదో తేదీన ప్రారంభమైన ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు పూల్–ఎఫ్ నుంచి పోటీకి దిగింది. గురువారం ఉదయం జరిగిన తొలి లీగ్‌లో చత్తీస్‌ఘడ్‌పై ఒక పాయింట్ తేడాతో గెలిచింది. అదేవిధంగా సాయంత్రం జరిగిన రెండో లీగ్‌లో తెలంగాణ జట్టుపై 16 పాయింట్ల ఆధిక్యాన్ని ప్రదర్శించింది. శుక్రవారం పూల్‌లోని బిహార్‌తో తలపడుతుంది. అయితే పూల్‌లోని రెండు జట్లను ఓడించిన రాష్ట్ర జట్టు ప్రీ క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. రాష్ట్ర జట్టును ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

టీటీడీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

విజయవాడకల్చరల్: తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనానికి టికెట్ల కోసం వచ్చిన భక్తులు అధికారుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందారని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక సంఘటనలు జరుగుతున్నాయని పరామర్శలకే పరిమితమయ్యారన్నారు. స్వాక్షాత్తూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఏం చేయలేమని చెప్పడం దారుణమన్నారు.

నగరంలోని ల్యాబ్‌లలో ఆకస్మిక తనిఖీలు



సూర్యారావుపేటలోని ఓ లేబొరేటరీలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): సూర్యారావుపేట, పటమట ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ లేబొరేటరీలు, ఎక్స్‌రే యూనిట్‌లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆధ్వర్యంలో రెండు బృందాలు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్, పరీక్షలు చేసే సిబ్బంది అర్హతలు తదితర అంశాలను తనిఖీ చేశారు. కొన్ని లేబొరేటరీలు నిబంధనలు పాటించక పోవడంతో పాటు సరైన పత్రాలు లేవని గుర్తించారు. నిబంధనలను విరుద్ధంగా నిర్వహిస్తున్న ల్యాబ్‌లకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం విధించారు. నిబంధనలు పాటించని ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. తనిఖీల్లో డీపీఎంఓ డాక్టర్ నవీన్, వైద్యులు విద్యాసాగర్, బాలాజీ, స్నేహ సమీర తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని స్థలాల్లో నోటీసు బోర్డుల ఏర్పాటు



నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఎంసీ రెవెన్యూ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ఖాళీ స్థలాల పన్నులను వాటి యజమానులు వెంటనే చెల్లించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఖాళీస్థలాల పన్నులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని గురువారం నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా బకాయి ఉన్న స్థలాల వద్ద వీఎంసీ నోటీసు బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు విద్యాధరపురం, దావు బుచ్చయ్య కాలనీ, రామకృష్ణాపురం, అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, గుణదల, కరెన్సీ నగర్, పటమట ప్రాంతాలోల ఖాళీ స్థలాల వద్ద వీఎంసీ నోటీసు బోర్డులు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆయా స్థలాల యజమానులు 15 రోజుల్లోగా వారి పన్నులను చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రెయినేజీ చార్జీలు పెద్దమొత్తంలో బకాయి ఉన్న వారు కూడా వెంటనే ఆయా పన్నులు చెల్లించాలని, లేని పక్షంలో వారి నీటి, డ్రెయినేజీ కనెక్షన్లను నిలుపదల చేస్తామని చెప్పారు.

అదనపు అంతస్తులు, నూతన పన్నులపై స్పెషల్ డ్రైవ్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన భవనాలు, అదనపు అంతస్తులపై కొత్తగా పన్నులు వేయాల్సిన ఆస్తులపై పన్నులు వేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరంలోని లబ్బీపేట పరిసర ప్రాంతాల్లో ఆయన నూతన పన్నులు వేసే భవనాలను గురువారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఇంటి పన్నుల క్రమబద్ధీకరణ జరుగుతుందన్నారు. ఈ క్రమంలో వీఎంసీ రెవెన్యూ విభాగం, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలో నూతనంగా నిర్మించిన భవనాలకు, వాడుకలో ఉండి పన్నులు వేయని భవనాలకు, పాత భవనాలపై అదనపు అంతస్తులు వేసిన వారు నూతన పన్నులు నమోదు చేసుకోవాలని సూచించారు. భవన యజమానులు వీఎంసీ సిబ్బంది సహకరించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

8 నుంచి మహిళా ఉత్సవ్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు వచ్చే నెల 8 నుంచి 16వ తేదీ వరకు మహిళా ఉత్సవ్ – 2025ను నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యాకన్నా మాట్లాడుతూ మొగల్రాజపురం మధుచౌక్‌లోని మొగల్ హాలులో మహిళా ఉత్సవ్ జరుగుతుందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మహిళా ఉత్సవ్‌లో ప్రదర్శించి విక్రయించుకోవచ్చని చెప్పారు. వ్యాపారంలో మెలకువలు నేర్చుకోవడంతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి మహిళా ఉత్సవ్ ఎంతగానో దోహదం చేస్తోందన్నారు. మహిళలు ఎవరైనా వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోడానికి మహిళా ఉత్సవ్ చక్కటి వేదిక అని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ అన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళా ఉత్సవ్–2025 వివరాలతో కూడిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి గ్రాంట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న నాగరాజు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఫండ్స్ ద్వారా మాజీ సైనికుల సంక్షేమానికి గ్రాంట్ ఇవ్వాలని మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కె.నాగరాజు కోరారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రీయ సైనిక బోర్డులో మాజీ సైనికుల సంఘాలకు సభ్యత్వం ఇవ్వాలన్నారు. సీఎస్ఆర్ ఎలిజిబుల్ కంపెనీ ద్వారా మాజీ సైనికుల బెటర్ లైఫ్ కోసం కోర్సులు ప్రవేశపెట్టాలని కోరారు. ఫ్లాగ్ డే ఫండ్ ద్వారా వచ్చిన నిధులు , ఖర్చుల వివరాలు జేఏసీకి తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ రిజర్వేషన్లు, జీవోలు అమలు చేయాలన్నారు. జాబ్ రిజర్వేషన్, ఎంబీబీఎస్ సీట్లు, ఎడ్యుకేషన్ రిజర్వేషన్ కోట వివరాలపై జేఏసీ, అనుబంధ సంస్థల కలిసి సమావేశాలు నిర్వహించాలన్నారు. జేఏసీ వైస్ చైర్మన్లు ఎం.శంకరరావు, ఉడిముడి రాజు, కె.నారాయణ, ఎస్.ఎన్.మూర్తి, కార్యదర్శి కె.కుమార్, ట్రెజరర్. తిరుపతిరావు, జాయింట్ సెక్రెటరీ కేకే నరసింహారావు, మీడియా ఇన్‌చార్జి జె.హరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థినికి ప్రశంసాపత్రం, మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయులు సదా స్మరణీయులని కేఎల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. సత్యనారాయణపురం విజ్ఞాన విహార్ పాఠశాల తమ 42వ వార్షికోత్సవాన్ని దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ కళాశాలలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న విజ్ఞాన విహార్ సంస్థలను అభినందించారు. విద్యాభారతి దక్షిణామ్నాయ సంఘటనా కార్యదర్శి లింగం సుధాకరరెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా విద్యాభారతి సంస్థ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. విజ్ఞాన విహార్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి, విద్యా సంస్థ పూర్వ విద్యార్థి డాక్టర్ బీవీ గురునాథ శర్మ, పారిశ్రామిక వేత్త వి.రమేష్‌బాబు, మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మట్టా ప్రసాద్ తదితరులు విజ్ఞాన విహార్ విద్యా రంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు.

తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): రాబోయే వేసవిలో నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన దుర్గా ఘాట్, గాంధీ మున్సిపల్ హైస్కూల్, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు త్రాగునీటి సరఫరాలో లోటు లేకుండా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. దీనికి స్థానిక కార్పొరేటర్లు, ఎమినిటీ కార్యదర్శులతో మాట్లాడి తగిన ప్రణాళిక సిద్ధం చేసి తనకు నివేదించాలని ఆదేశించారు. అనంతరం ఆయన గాంధీ మున్సిపల్ హైస్కూల్ దగ్గర ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్లను నోడల్ ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షిస్తుండాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన దుర్గా ఘాట్‌లో ఉన్న టాయిలెట్లను పరిశీలించి, ఆ ప్రదేశంలో నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ప్రధాన రోడ్లు, వీధుల్లో రోడ్లపై ఉన్న గుంతలను త్వరితగతిన పూడ్చివేయాలని ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.